మల్లన్న మూలవిరాట్టు దర్శనం నిలిపివేత

- భక్తుల దర్శనార్థం ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు
- ఈనెల 7న దృష్టికుంభం నిర్వహించాక మూలవిరాట్టు దర్శనం ప్రారంభం

7లో..

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



సిద్దిపేట
5
మంగళవారం 2 జనవరి 2024





సిద్దిపేట కోమటిచెరువు వద్ద సందడి

కొత్త కిక్కు



సిద్దిపేటలో సెల్ఫీ తీసుకుంటున్న యువతులు



ఉమ్మడి జిల్లాలో ఉత్సాహంగా న్యూ ఇయర్ వేడుకలు

ఆలయాలు, పుణ్యక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు

సందర్శకులతో కిటకిటలాడిన కోమటిచెరువు, రంగనాయకసాగర్

జోరుగా మద్యం అమ్మకాలు

మటన్, చికెన్, చేపలకు భలే గిరాకీ

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఉమ్మడి మెదక్ జిల్లాలో సోమవారం సందడి వాతావరణం నెలకొన్నది. 2024 సంవత్సరానికి ఉత్సాహంగా స్వాగతం పలికారు. తెల్లవారుజాము నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సంగారెడ్డి జిల్లా ఝరాసంగం, రేజింతల్, గణేష్‌గడ్డ, మెదక్ జిల్లా ఏడుపాయల, సిద్దిపేట జిల్లా వర్గల్ విద్యాధరి క్షేత్రం, నాచగిరి క్ష్మీనరసింహస్వామి ఆలయం, చిన్నకోడూరు మండలం అనంతసాగర్‌లోని సరస్వతీ క్షేత్రం, కొమురవెల్లి మల్లన్న ఆలయానికి భక్తులు పోటెత్తారు. దర్శనం కోసం భక్తులు గంటల తరబడి క్యూలో నిల్చున్నారు. సిద్దిపేటలోని కోమటిచెరువు, చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ ప్రాజెక్టు వద్ద సందర్శకుల సందడి నెలకొన్నది.

నూతన సంవత్సర వేడుకలతో మద్యం అమ్మకాలు జోరుగా సాగాయి. సిద్దిపేట జిల్లాలో రెండు రోజుల్లో రూ.20 కోట్లు, మెదక్ జిల్లాలో మూడు రోజుల్లో రూ.9.17 కోట్లు, సంగారెడ్డి జిల్లాలో ఒక్కరోజులోనే రూ.7.80 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగినట్లు అంచనా..

వార్త 7వ పేజీలో..



సిద్దిపేటలోని కేబుల్ బ్రిడ్జిపై సందర్శకులు



చిన్నకోడూరు మండలం రంగనాయకసాగర్ ప్రాజెక్టు వద్ద సందర్శకులు



వర్గల్ విద్యాసరస్వతీ అమ్మవారి దర్శనం కోసం ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

పగమంచు

తెల్లవారుజామున ప్రయాణం.. ప్రాణాలతో చెలగాటం



పొగమంచులో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న చెరకు ట్రాక్టర్

- పొంచిఉన్న ప్రమాదం
- కళ్లు నులుముకున్నా కనిపించని రోడ్డు
- లైట్లు వేసుకున్నా ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించలేని పరిస్థితి
- తరచుగా ప్రమాదాలు
- అప్రమత్తతే శ్రీరామరక్ష



పొగమంచులో రోడ్డు కనిపించక మెదక్ జిల్లా కోలపల్లి వద్ద డివైడర్‌ను ఢీకొన్న కారు (ఫైల్)

7లో

వణికిస్తున్న చలి



- ఉమ్మడి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు
- సంగారెడ్డి జిల్లా ఆల్గోల్‌లో 10.5 డిగ్రీలు
- మెదక్ జిల్లా దామరంచలో 12.9 డిగ్రీలు
- సిద్దిపేట జిల్లా హబ్సీపూర్‌లో 13.6 డిగ్రీలు



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మల్లన్న కల్యాణ ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఈవో బాలాజీశర్మ

అభినందనలు తెలిపేందుకు

బొకేలు వద్దు

- నోట్ బుక్కులు, పెన్నులు అందిస్తే నిరుపేద విద్యార్థులకు సహాయం చేయగలం
- మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

సిద్దిపేట క్రైం, జనవరి 1 : అభినందనలు తెలిపే సందర్భంగా పూల బొకేలు, శాలువాలు వద్దని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా పూలబొకేలకు బదులుగా సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ నోట్ బుక్‌లను అందించడం అభినందనీయం అన్నారు. తన దగ్గరికి వచ్చి శుభాకాంక్షలు తెలిపేవారు కూడా ఇలాంటి బుక్‌లను అందించడం వల్ల నిరుపేద విద్యార్థులకు సహాయం చేయగలుగుతామని చెప్పారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో దుబారా ఖర్చులు చేసి ప్రజలను అప్పుల్లో ముంచారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అలాంటి ఖర్చులకి దూరంగా ఉంటూ ప్రజలకు ఏ పథకాలు అందించాలో దానిపైనే దృష్టి పెడతామన్నారు. రాబోయే ఐదేళ్లపాటు ఇదే తరహా పద్ధతిని పాటించాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అభిమానులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీ మైనారిటీ అధ్యక్షులు మజర్మాలిక్, పట్టణ యువజన అధ్యక్షులు గయాజుద్దీన్, ఎన్ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ రాషద్, ఆయిబ్ పాల్గొన్నారు.

మంత్రికి మల్లన్న కల్యాణ ఆహ్వానపత్రిక అందజేత

చేర్యాల : మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కొమురవెల్లి మల్లన్న ఆలయాధికారులు సోమవారం స్వామివారి కల్యాణ ఆహ్వానపత్రికను అందజేశారు. ఈసందర్భంగా ఈవో బాలాజీశర్మ తదితరులు సెక్రటేరియట్‌లో మంత్రి పొన్నంను కలిసి ఈనెల7న జరిగే మల్లన్న కల్యాణానికి రావాలని ఆహ్వానించారు. ఆయన వెంట ఆలయ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, స్థానాచార్యుడు పడిగన్నగారి మల్లయ్య ఉన్నారు.










చట్ట ప్రకారం న్యాయం చేయాలి

● అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ అర్బన్, జనవరి 1: పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి బాధితులకు చట్ట ప్రకారం న్యాయం చేయాలని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాయలంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వినతులను స్వీరించి వారితో మాట్లాడి సమస్యలను తెలసుకున్నారు. దరఖాస్తుదారులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు.









రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

● ఆగి ఉన్న డీసీఎంను ఢీకొన్న బైక్



బెజ్యానాయక్(ఫైల్)

రామాయంపేట. జనవరి 1: ఆగి ఉన్న డీసీఎంను బైక్ ఢీకొనడంతో ఒకరు మృతిచెందిన సంఘటన రామాయంపేట మండలం తోనిగాండ్ల శివారులో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గంగాపూర్‌కు చెందిన మూడావత్ బెజ్యానాయక్(45) పని నిమిత్తం రామాయంపేటకు వచ్చి తిరిగి వెళ్తున్నాడు. రాత్రి కావడంతో రోడ్డు పక్కన నిలిచి ఉన్న డీసీఎం సరిగ్గా కనిపించక బైక్‌తో ఢీకొట్టాడు. బైక్‌పై నుంచి కిందపడిన బెజ్యానాయక్ అక్కడిక్కడే మృతిచెందాడని ఎస్‌ఐ రంజిత్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పైపులు మీదపడి కార్మికుడి మృతి



అగుచోటు మృతదేహం

మనోహరాబాద్, జనవరి1: పరిశ్రమలో పనిచేస్తుండగా పైపులు మీదపడి కార్మికుడు మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలం పరిధిలోని కాళ్లకల్ గ్రామ శివారులోని ఎంపియల్ పరిశ్రమలో ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు మూడేళ్ల నుంచి పనిచేస్తూ పరిశ్రమ రూంలో నివసిస్తున్నారు. అయితే ఆదివారం రాత్రి అగుచోటు(20) డ్యూటీ చేస్తుండగా అతనిపై పైపులు పడ్డాయి. పక్కనే పరిశ్రమ రూంలో ఉన్న అన్న కహ్నాయ్య వెంటనే అతడిని మేడ్చల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని తెలిపారు. అనంతరం మృతదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అన్న కహ్నాయ్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వ్యవసాయశాఖ గెజిటెడ్ అధికారుల సంఘం

రాష్ట్ర అధ్యక్షుడిగా వైద్యనాథ్



వైద్యనాథ్

సంగారెడ్డి అర్బన్ జనవరి 1: వ్యవసాయశాఖ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా సంగారెడ్డికి చెందిన డాక్టర్ డి.వైద్యనాథ్ ఎన్నికయ్యారు. సంఘం ఎన్నికలు ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన భవన్‌లో జరిగాయి. ఈ సందర్భంగా డి.వైద్యనాథ్ మాట్లాడుతూ వ్యవసాయశాఖలో అధికారులు, ఉద్యోగులకు కొన్నేళ్లుగా ప్రమోషన్లు లేవన్నారు. త్వరలోనే వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి అధికారులు, ఉద్యోగుల ప్రమోషన్లు, ఇతరత్రా సమస్యలను పరిష్కరిచాలని కోరనున్నట్టు వైద్యనాథ్ తెలిపారు.

విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలి

● సామాజిక శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి



మాట్లాడుతున్న ఎల్లారెడ్డి

నారాయణఖేడ్, జనవరి 1: విద్యార్థులను ఉపాధ్యాయులు ఉత్తములుగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని కామారెడ్డి జిల్లాకు చెందిన సామాజిక శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి కోరారు. సోమవారం ఖేడ్ సరస్వతీ శిశుమందిర్‌లో నిర్వహించిన మాతృ, పితృ దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 2001లో తాను జపాన్‌లో పలు కంపెనీలను ఏర్పాటు చేశానన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్న తపనతో స్వదేశానికి వచ్చి 2018 నుంచి ముఖ్యంగా కామారెడ్డి జిల్లాలో రూ.కోట్లు వెచ్చించి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. శిశుమందిర్‌లో వేదిక నిర్మాణం కోసం సహాయం చేయడంతో పాటు త్వరలో వచ్చి పాఠశాలకు ఏమేం అవసరమో వాటిని సమకూర్చుతానని హామీ ఇచ్చారు. ప్రబంధకారిణి అధ్యక్షుడు నారాయణ ఆయనను శాలువాతో సన్మానించారు. ఇందులో కామారెడ్డి జిల్లా నాగిరెడ్డి పేట ఎంపీపీ రాజుదాస్, జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, పత్రి రామకృష్ణ, గోపాల్‌రెడ్డి, చంద్రారెడ్డి, సంజీవ్, నగేష్‌యాదవ్, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. అనంతరం పైడి ఎల్లారెడ్డి ఖేడ్ మండలం కొండాపూర్ హనుమాన్ ఆశ్రమాన్ని సందర్శించి ఆశ్రమ పీఠాధిపతి, అఖిల భారత సాధు సంతుల రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహరాజ్, అంతర్గాం ఆశ్రమాన్ని సందర్శించి పీఠాధిపతి కరణ్‌గజేంద్ర భారతి మహరాజ్ ఆశీస్సులు పొందారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత

● రైల్వేబోర్డు సభ్యుడు షేక్‌ఫరీద్

జహీరాబాద్, జనవరి 1: క్రీడలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని రైల్వే బోర్డు సభ్యుడు షేక్‌ఫరీద్ పేర్కొన్నారు. వారం రోజులుగా జహీరాబాద్ పట్టణంలోని బాగారెడ్డి స్టేడియం గ్రౌండ్‌లో జడ్పీఎల్ (జహీరాబాద్ ప్రీమీయర్ లీగ్) క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఆదివారం రాత్రి ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణతో పాటు ఇతరత్రా రాష్ట్రలకు చెందిన క్రీడాకారులు జడ్పీఎల్ టోర్నమెంట్‌లో పాల్గొనడం విశేషమన్నారు. కాగా విన్నర్‌గా నిలిచిన ముజీబ్‌సీసీ, జహీరాబాద్ జట్టుకు రూ.50 వేల నగదు ట్రోఫీ, రన్నర్‌గా నిలిచిన ప్రవీణ్‌షేకాపూర్ టీంకు రూ.30 వేల నగదు, ట్రోఫీని అందజేశారు. ఇదిలా ఉండగా బెస్ట్‌బౌలర్, బెస్ట్ బ్యాట్స్‌మెన్లకు నగదు, కప్పులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నయీమ్, నాయకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్డారం వెంకటేశ్వరస్వామి జాతర

పటాన్‌చెరు, జనవరి 1: పురాతన లక్డారం వెంకటేశ్వరస్వామి జాతర అంగరంగ వైభవంగా కొనసాగింది. జాతరలో పాల్గొనేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. కొత్త సంవత్సరం కూడా కావడంతో జాతరలో పాల్గొనేందుకు భక్తులు పోటెత్తారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.







కొమురవెల్లి మల్లన్న ఆలయ గంగరేగుచెట్టు ఆవరణలో భక్తజనసందోహం, ప్రసాద విక్రయశాల కౌంటర్ వద్ద ఇబ్బందులు పడుతున్న మహిళలు

కొత్త కిక్కు

హోరెత్తిన నూతన సంవత్సర వేడుకలు

ఉమ్మడి జిల్లాలో నూతన సంవత్సర వేడుకలు కోలాహలంగా జరిగాయి. కేక్‌లను కట్‌చేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. పలుచోట్ల టపాసులు పేల్చి సంబురాలు చేసుకున్నారు. మహిళలు వాకిట్లో చూడముచ్చటైన రంగువల్లులను తీర్చిదిద్ది ముగ్గులతో శుభాకాంక్షలు తెలిపారు. ఉదయం నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. సందర్శక ప్రాంతాలు కిటకిటలాడాయి. చిన్నాపెద్దా, యువతీయువకులు సెల్ఫీలు దిగుతూ ఆనందోత్సాహాల మధ్య గడిపారు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధులు, సిద్దిపేట/సంగారెడ్డి/ మెదక్ అర్బన్, జనవరి1

- జోరుగా మద్యం అమ్మకాలు
- మటన్, చికెన్, చేపలకు భలే గిరాకీ

తీపి, చేదు జ్ఞాపకాల 2023వ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ.. కొత్త ఆశల 2024 నూతన ఏడాదికి జిల్లా ప్రజలు అట్టహాసంగా స్వాగతం చెప్పారు. ఆకాశమే హద్దుగా సంబరాలను మిన్నంటేలా జరుపుకున్నారు. డిసెంబరు 31వ తేదీ ఆదివారం కావడంతోపాటు జనవరి 1న సెలవు దినం కారణంగా రెండ్రోజుల పాటు వేడుకల్లో మునిగి తేలారు. ఖర్చుకు వెనుకాడకుండా మాంసం, మద్యం, కేకులు, బిర్యానీలు, విందు భోజనాలతో నూతన సంవత్సరాన్ని పండగ వాతావరణంలో నిర్వహించుకున్నారు.

కిటకిటలాడిన మటన్, చికెన్ సెంటర్‌లు

నూతన సంవత్సర వేడుకల సందర్భంగా డిసెంబరు 31న చికెన్, మటన్ దుకాణాలు కిటకిటలాడాయి. ఓవైపు కేకులకు, మరోవైపు మాంసాహారానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. చికెన్ కిలో ధర రూ.260 నుంచి రూ.300 వరకు, మటన్ కిలో ధర రూ.800 నుంచి రూ.900 వరకు ఉన్నది. మటన్, చికెన్ ధరలు మండినప్పటికీ కొనుగోలు కోసం ప్రజలు బారులు తీరడం కనిపించింది. సిద్దిపేటలోని ఓ మటన్ షాపులో సాధారణ ఆదివారాల్లో రెండు మేకల మాంసాన్ని విక్రయించగా 31వ తేదీన 5 మేకల మాంసాన్ని అమ్మినట్లు నిర్వాహకులు చెప్పారు. ఇక చికెన్ సెంటర్లు, చేపల దుకాణాల వద్ద పోటీ నెలకొన్నది. ఒక రోజు ముందుగానే ఆర్డర్లు ఇచ్చి పెట్టుకునే పరిస్థితి తలెత్తింది. సోమవారం సైతం సెలవు రోజే కావడంతో ప్రత్యేకంగా విందులు చేసుకున్నారు. ఇదేకాకుండా సొంతంగా గొర్రెలు, మేకలు, నాటుకోళ్లతో విందు భోజనాలు చేసుకున్న వారి సంఖ్య బాగానే ఉంది. మెదక్ జిల్లా వ్యాప్తంగా దాదాపు 400 మటన్, సుమారు 600 చికెన్ దుకాణాలున్నాయి. జిల్లాలో దాదాపు రూ.5 కోట్ల వరకు విక్రయాలు జరిగాయి. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 720 మాసం దుకాణాలున్నాయి. జిల్లాలో రూ.6.50 కోట్ల మేర మాంసం అమ్మకాలు జరిగాయి. అనధికార లెక్కల ప్రకారం రూ.4 కోట్ల మేర చికెన్, రూ.2.50 కోట్ల మేర మటన్‌ను విక్రయించారు. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.10కోట్ల పైచిలుకు మాంసం విక్రయాలు జరిగాయి.



సిద్దిపేట కోమటి చెరువు వద్ద జనం

స్వీట్ కేకులు.. హాట్ బిర్యానీలు

కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు సూచికగా కేకులను కట్ చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. దీంతో సిద్దిపేట జిల్లా కేంద్రంతోపాటు హుస్నాబాద్, గజ్వేల్, దుబ్బాక, చేర్యాల పట్టణాల్లోని బేకరీలు జనంతో కిక్కిరిసాయి. ఒక్కో షాపులో వందల కొద్దీ కేకులను కొనుగోలు చేశారు. సిద్దిపేటలోని మెదక్‌రోడ్డులో గల ఒక బేకరీలో 2వేలకు పైగానే కేకులు అమ్ముడైనట్లు తెలిసింది. అదే విధంగా బిర్యానీ సెంటర్ల ముందు బారులు తీరారు. వాతావరణం చల్లగా ఉండడంతో హాట్‌హాట్‌గా చికెన్, మటన్ బిర్యానీల వైపు మొగ్గు చూపారు. కేకులు, బిర్యానీలకు కూడా ఆఫర్లు పెట్టారు. కేకులు, బిర్యానీలకు సంబంధించి కోట్లలోనే వ్యాపారం జరిగినట్లు అంచనా. ప్రత్యేకంగా ఇళ్లలో, అపార్ట్‌మెంట్లలో, సంఘాల వారీగా, బ్యాచ్‌ల వారీగా కేకులను తెచ్చి కట్ చేశారు. సంగారెడ్డి జిల్లాలో 250 బేకరీలు షాపులున్నాయి. వీటిలో రూ.3 కోట్ల మేర కేకులు అమ్ముడయ్యాయి. కేకులు కిలో ధర రూ.400 నుంచి రూ.500 వరకు అమ్ముడైంది. గత ఏడాది రూ.2.50 కోట్ల మేర కేకులు అమ్ముడవగా, ఈసారి రూ.50 లక్షల మేర అదనంగా కేకులు అమ్ముడయ్యాయి.

613 మందిపై కేసులు

సంగారెడ్డి జిల్లాలో న్యూ ఇయర్ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన 613 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. వీరికి రూ.2.80 లక్షల జరిమానాను విధించారు. డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 150 మంది పట్టుబడ్డారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడిపిన వారు 123 మంది, ట్రిపుల్ రైడింగ్ చేసిన వారు 50 మంది, రాంగ్‌సైడ్ డ్రైవింగ్ చేసినవారు 250 మంది, హెల్మెట్ లేకుండా ప్రయాణించిన వారు 57 మంది ఉన్నారు. ఇక నూతన సంవత్సర స్వాగతం సందర్భంగా ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అనేక ప్రాంతాల్లో ఆదివారం రాత్రి ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ చెన్నూరి రూపేశ్ స్వయంగా సంగారెడ్డి పట్టణంలో ఐబీఐ సమీపంలో రోడ్డుపై నిల్చుని తనిఖీలు చేపట్టడం గమనార్హం.



మెదక్ పట్టణంలో వైన్స్‌షాపు ఎదుట మందుబాబులు

ఆబ్కారీ శాఖకు భారీగా ఆదాయం

మద్యం అమ్మకాలకు నూతన జోష్ వచ్చింది. లెక్కకు మించిన కిక్కుతో ఎక్సైజ్ శాఖకు భారీగా కలిసొచ్చింది. మద్యం ప్రియులు నూతన సంవత్సరానికి స్వాగత పలుకుతూ మద్యాన్ని ఏరులై పారించారు. డిసెంబరు 31 అర్ధరాత్రి వరకు వైన్స్ షాపులు, బార్లు తెరిచి ఉంచడంతో మద్యం విక్రయాలు కోట్లకు పరుగు తీశాయి. వైన్ షాపుల్లో గల్లపెట్టెలు గలగలలాడాయి.

సిద్దిపేట జిల్లాలో రెండు రోజుల్లో రూ.20 కోట్ల మద్యం విక్రయాలు

సిద్దిపేట జిల్లాలో 93 మద్యం దుకాణాలు, 13 బార్లు రెండురోజుల పాటు మందుబాబులతో కిక్కిరిసిపోయింది. ఇవి కాకుండా తాటివనాలకూ బారులు తీరారు. కల్లు డిపోలకు కూడా గిరాకీ పుష్కలంగా పెరిగింది. మొత్తంగా రెండు రోజుల్లోనే రూ.20 కోట్ల పైచిలుకు విక్రయాలు జరిగినట్లు అంచనా. వైన్‌షాపుల ఎదుట పెద్దఎత్తున క్యూకట్టి మద్యం కొనుగోలు చేశారు. సాధారణ రోజుల్లో రూ.4లక్షల విలువైన మద్యాన్ని విక్రయించే వైన్ షాపుల్లో ఆది, సోమవారాల్లో రూ.10లక్షలకు పైగానే విక్రయించారు. చాలామంది ప్రణాళిక ప్రకారం విందులు, వినోదాలు ఏర్పాటు చేసుకొని శనివారం రోజునే మద్యాన్ని కొనుగోలు చేసి పెట్టుకున్నారు. ఫలితంగా మూడు రోజుల్లోనూ మద్యం విక్రయాలు భారీగా ఉన్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొన్నది. డిసెంబరు 1వ తేదీన కొత్త షాపుల బాధ్యతలు తీసుకున్న నిర్వాహకులకు న్యూఇయర్ కిక్కు మంచి లాభాలను తెచ్చిపెట్టింది.

సంగారెడ్డి జిల్లాలో మద్యం విక్రయాలు రూ.7.80 కోట్లు

సంగారెడ్డి జిల్లాలో ఎక్కువగా మద్యానికే ఖర్చు పెట్టారు. జిల్లాలో 101 వైన్‌షాపులు, 34 బార్‌షాప్‌లున్నాయి. వీటి ద్వారా ఒక్క ఆదివారం నాడు రూ.7.80 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి. ఇందులో 9085 ఐఎంఎల్ లిక్కర్ కేసులు (ఒక్క కేసులో 12 బాటిళ్లు), 5,548 బీరు కేసులు అమ్ముడయ్యాయి. బ్రాండ్లను బట్టి ధరలున్నాయి. ఫుల్‌బాటిల్ ధర రూ.1000 నుంచి రూ.3,000 దాకా ఉన్నది. అదేస్థాయిలో హాఫ్‌బాటిల్ ధరలు రూ.500 నుంచి 1500 వరకు, క్వార్టర్ బాటిల్ ధర రూ.300 నుంచి రూ.1000 వరకు ఉన్నది. ఇక బీరు బాటిల్ ధరలు బ్రాండ్లను బట్టి రూ.175 నుంచి రూ.300 వరకు ఉన్నది. లిక్కర్, బీర్ల ధరలు ఇలా ఉన్నా వీటి కొనుగోలు కోసం మాత్రం జిల్లాలోని ప్రతీ వైన్ షాపులో సాధారణ రోజు కన్నా ఆదివారం రోజు రాత్రి లక్షరూపాయల చొప్పున మద్యం అమ్మకాలు పెరిగాయి. గతేడాది ఇదే నూతన సంవత్సర వేడుకలతో పోల్చితే ఈ సారి మద్యం అమ్మకాలు కోటి రూపాయల దాకా పెరిగింది. గతేడాది రూ.6.97 కోట్ల అమ్మకాలు జరిగాయి.

మెదక్ జిల్లాలో మూడు రోజుల్లో రూ.9.17 కోట్లు

మెదక్ జిల్లా వ్యాప్తంగా 49 మద్యం దుకాణాల్లో మూడు రోజుల్లో రూ.9.17 కోట్ల మద్యాన్ని విక్రయించారు. డిసెంబరు నెలలో లిక్కర్ 69,762 కేసులు, బీర్ 77,786 కేసులు అమ్ముడుపోయాయి. డిసెంబరు 29 నుంచి 31 అర్ధరాత్రి వరకు లిక్కర్ 9,186, బీర్లు 10,337 కేసులు విక్రయించగా రూ.9.17 కోట్లు ఆదాయం సమకూరినట్లు ఎక్సైజ్‌శాఖ అధికార లెక్కలు చెబుతున్నాయి.



సంగారెడ్డిలోని వైన్స్‌షాపు వద్ద మందుబాబులు

ఆలయాలు, సందర్శక ప్రాంతాలు కిటకిట

సిద్దిపేట అర్బన్/మెదక్ అర్బన్/చేర్యాల : కొత్త సంవత్సరం మొదటి రోజున దైవదర్శనం చేసుకుంటే ఏడాదంతా శుభం కలుగుతుందని భావించి పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివెళ్లారు. సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లన్న ఆలయం, వర్గల్ విద్యాధరి ఆలయం, నాచగిరి లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, కొండపోచమ్మ ఆలయం, సిద్దిపేటలోని కోటిలింగాల, శరబేశ్వర, వెంకటేశ్వరస్వామి ఆలయాలు, హుస్నాబాద్‌లోని పొట్లపల్లి స్వయంభూరాజేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. అదేవిధంగా అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు తరలివెళ్లడం కనిపించింది. సిద్దిపేట కోమటిచెరువు, రంగనాయకసాగర్, కొండపోచమ్మసాగర్ వద్ద పర్యాటక సందడి నెలకొన్నది. కొమురవెల్లి మల్లన్న ఆలయం భక్తులతో రద్దీగా మారింది. ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. నూతన సంవత్సరంలో తమ కోరికలు ఈడేర్చి అన్నివిధాలుగా కలిసిరావాలని, చేపట్టిన కార్యం విజయవంతమవ్వాలని మల్లన్నను, ఎల్లమ్మతల్లిని మనసారా వేడుకున్నారు. 25వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయవర్గాలు తెలిపాయి. భక్తుల రద్దీ దృష్ట్యా ప్రసాద విక్రయశాల వద్ద మహిళలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. పురుషులు, స్త్రీలకు ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటుచేయకపోవడంతో ఒకే క్యూలైన్‌లో నిలబడి తోపులాటతో తంటాలుపడ్డారు. మెదక్ జిల్లాలో ఉదయం నుంచే ఆలయాల్లో భక్తుల సందడి నెలకొన్నది. మెదక్ పట్టణంలోని వేంకటేశ్వరాలయం, కోదండ రామాలయంతోపాటు తూప్రాన్, నర్సాపూర్, రామాయంపేట పట్టణాల్లోని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. చర్చి, ఏడుపాయల వనదుర్గామాత అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు.



మెదక్ కోదండ రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రోడ్డుపై కేక్‌ను కట్ చేసిన సంగారెడ్డి జిల్లా ఎస్పీ

సంగారెడ్డి క్రైం : ప్రజలు సుఖ సంతోషాలతో, ఆనందాల మధ్య వేడుకలు నిర్వహించుకున్నప్పుడే మాకు పండుగ రోజని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం అర్ధరాత్రి తర్వాత సంగారెడ్డిలో రోడ్డుపై కేక్‌ను కట్ చేశారు. అనంతరం పోలీసులతో కలిసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రమేష్ కుమార్, సీఐలు శ్రీదర్‌రెడ్డి, సుధీర్‌కుమార్, నాగరాజు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కొమురవెల్లి ఆలయంలో మల్లన్న మూలవిరాట్టు దర్శనం నిలిపివేత

చేర్యాల, జనవరి 1 : కొమురవెల్లి మల్లన్న కల్యాణం సందర్భంగా మూలవిరాట్టు దర్శనాన్ని సోమవారం సాయంత్రం నిలిపి వేశారు. మూలవిరాట్టును సుందరీకరించనున్నందున గర్భాలయ ప్రవేశం, దర్శనాన్ని బంద్ చేశారు. భక్తుల కోసం ఉత్సవ విగ్రహాలను నెలకొల్పారు. ఈనెల 7వ తేదీన తెల్లవారు జామున దృష్టి కుంభం నిర్వహించి మూలవిరాట్టు దర్శనం ప్రారంభించనున్నారు.



గర్భాలయ ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ఉత్సవ మూర్తులు

మేనమామను కడతేర్చిన అల్లుడు

- ఆస్తి కోసం కత్తితో గొంతు కోసి హత్య... నిందితుల అరెస్టు
- మెదక్ జిల్లా కేంద్రంలో దారుణం

మెదక్ అర్బన్, జనవరి 1: మెదక్ జిల్లా కేంద్రంలో దారుణం జరిగింది. ఆస్తి విషయంలో మేనమామను అల్లుడు హత్య చేసిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకున్నది. నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ పట్టణంలోని రాంనగర్ చెందిన సిద్దేశ్వరీగారి ప్రభాకర్(42) కూలీ పని చేస్తుంటాడు. 10 నెలల క్రితం భార్య విజయ భర్తను విడిచి పుట్టింటికి వెళ్లింది. ప్రభాకర్, ఆయన చెల్లెలు యశోధ, అల్లుడు ఏసుప్రభు ఒకే ఇంట్లో పక్కపక్కన ఉన్న గదుల్లో ఉంటున్నారు. ఈ ఇళ్లు తండ్రి సిద్దిరాములు పేరుపై ఉన్నది. కొన్నేళ్లుగా అన్నాచెల్లెలు మధ్య ఇంటి పంపకం విషయంలో తగదాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో మృతుడు ప్రభాకర్ రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చి చెల్లెలుతో గొడవ పడి అన్నం పెట్టుమన్నాడు. ఇద్దరి మధ్య మాటమాట పెరిగింది. ఈ క్రమంలో చెల్లెలు యశోధ తల పట్టుకోగా అల్లుడు ఏసుప్రభు కత్తి తీసుకొని గొంతు కోసి హత్య చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి జగిలాలతో చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వెంకటేష్ తెలిపారు.

పగమంచు

హైదరాబాద్ నుంచి నాందేడ్ వైపు వెళ్తున్న కారు శుక్రవారం ఉదయం పొగమంచు కారణంగా రహదారి కనిపించపోవడంతో మెదక్ జిల్లా పెద్దశంకరంపేట హైవే 161పై కోలపల్లి పాత టోల్ ప్లాజా వద్ద డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. కోలపల్లి పాత టోల్‌ప్లాజా వద్ద నాలుగు రోజుల్లో ఇలా మూడు ప్రమాదాలు జరిగాయి.

సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం మద్దికుంట చౌరస్తాలో 65వ నంబరు జాతీయ రహదారిపై శనివారం ఉదయం రెండు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ సహా ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి.

ఐదారు రోజులుగా పొగమంచు కారణంగా ప్రధాన రహదారులపై రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పొగమంచు పగబట్టినట్టుగా తెల్లవారుజామున ప్రయాణం చేయడం ప్రాణాలతో చెలగాటంలా మారింది. తాజాగా సోమవారం తెల్లవారుజామున పటాన్‌చెరు శివారులో జరిగిన దారుణ ప్రమాదంలో ఏకంగా ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. ఈ ఘటనలోనూ ఉదయం పొగమంచు కారణంగానే రోడ్డు సరిగ్గా కనిపించకపోవడంతో స్కూటీ డివైడర్‌ను ఢీకొన్నది. తెల్లవారుజామున వాహనాలపై ప్రయాణం చేసే వారు సరైన జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తతతో నెమ్మదిగా వెళ్లడమే సురక్షితం.

- రహదారులను దట్టంగా కమ్మేస్తున్న పొగమంచు
- తెల్లవారుజామున ప్రయాణం.. ప్రాణాలతో చెలగాటం
- లైట్లు వేసుకున్నా ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించలేని పరిస్థితి
- తరచుగా ప్రమాదాలు...అప్రమత్తతే శ్రీరామరక్ష

సంగారెడ్డి క్రైం, జనవరి 1 : రోడ్లపై ఉదయం వేళ పొంగమంచు కమ్మేయడంతో డ్రైవర్లకు వాహనాలు నడపడం కష్ట సాధ్యంగా మారింది. హైదరాబాద్ నుంచి ముంబయి, షిర్డీకి పటాన్‌చెరు, సంగారెడ్డి, సదాశివపేట, జహీరాబాద్ మీదుగా 65వ నంబరు జాతీయ రహదారిపై ప్రతీరోజు వేలాది వాహనాలు వెళ్తుంటాయి. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులన్నీ రాత్రి వేళల్లో ప్రారంభమై ఉదయం వేళ వరకు గమ్యస్థానాన్ని చేరుకోవడానికి ప్రయత్నిస్తుంటాయి. ప్రైవేట్ బస్సులు తక్కువలో తక్కువగా గంటకు 100 కిలోమీటరు వేగంతో వెళ్తుంటాయి. ఉదయం వేళ దగ్గరకు వెళ్తేగానీ ముందున్న వాహనం కనిపించడం లేదు. హెడ్‌లైట్లు వేసుకొని వెళ్తున్నా ముందున్న వాహనాలను గుర్తించలేకపోతున్నారు. పొగమంచు కారణంగా ఐదారు రోజులుగా జరిగిన ప్రమాదాలే ఉదాహరణ. పెద్దశకంరంపేట మండలం కోలపల్లి పాత టోల్ ప్లాజా వద్ద మూడు ప్రమాదాలు, సదాశివపేట మండలం మద్దికుంట వద్ద ట్రావెల్స్ బస్సులు ఢీకొనడం, అలాగే సోమవారం పటాన్‌చెరు శివారులో దారుణ ప్రమాదం పరిస్థితిని కళ్లకుకడుతున్నది.

ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- తక్కువ బీమ్‌లో హెడ్ లైట్లను సెట్ చేసుకోవాలి. హైబీమ్ హెడ్‌లైట్లను ఉపయోగించడం వల్ల పొగ మంచు కాంతికి రిఫ్లెక్ట్ అయి ప్రమాదాలకు దారి తీస్తుంది.
- 100 మీటర్ల కంటే తక్కువ దూరంలో ఉన్న వాహనాన్ని చూడలేని సమయంలో కారు ఫాగ్ ల్యాంప్‌ను ఆన్ చేయాలి.

పరిమిత వేగంతో ప్రయాణిస్తున్నట్లయితే వాహన నియంత్రణ సాధ్యమవుతుంది. వాహన వేగాన్ని తగ్గించాలి. అలాగే పొగమంచులో ప్రయాణం చేసే సమయంలో వాహనాల్లో సౌండ్ సిస్టమ్‌ను ఆపివేయాలి.

- పొగమంచు సమయంలో డ్రైవింగ్ చేస్తున్నప్పుడు ఎక్కువ దూరంగా ఉన్న వాహనాలను చూడలేం. ఎవరు, ఎప్పుడు లేన్‌లను మారుస్తున్నారో గుర్తించడం చాలా కష్టం. ప్రయాణిస్తున్న లేన్‌లను మార్చవద్దు.
- పొగమంచుతో కూడిన రహదారిపై డ్రైవింగ్ చేస్తున్న సమయంలో వాహనాలు ఎడమ వైపు నడుపుతూ, మలుపు తిరిగేటప్పుడు, అవసరమైన చోట ఇండికేటర్లను ఉపయోగించాలి.
- కారు అద్దాలు క్లీన్‌గా ఉండేలా చూసుకోవాలి. బయటి పొగమంచు వాహనం లోపలి భాగంలో ఘనీభవనానికి కారణమై, డ్రైవర్ దృష్టికి మరింత ఆటంకం కలిగిస్తుంది. కార్ హీటర్‌ను ఆన్ చేయాలి.
- పొగమంచు ఉన్న సమయంలో డ్రైవింగ్‌లో సహనం కీలకం. ఓవర్ టేక్ చేయడానికి ప్రయత్నించినప్పుడు ఎదుటి డ్రైవర్ ఏకాగ్రత దెబ్బతిని రోడ్లపై ప్రమాదాలు జరుగుతాయి. వాహనానికి, వాహనానికి మధ్య పరిమిత దూరాన్ని పాటించాలి. వాహనాలను ఓవర్ టేక్ చేయకూడదు.



సదాశివపేట మండలం మద్దికుంట వద్ద పొగమంచు కారణంగా ఢీకొన్న రెండు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు(ఫైల్)



సంగారెడ్డిలో ఉదయం వేళలో పొగమంచు కారణంగా లైట్లు వేసుకొని వెళ్తున్న వాహనాలు

వణికిస్తున్న చలి

- ఉమ్మడి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు
- సంగారెడ్డి జిల్లా ఆల్గోల్‌లో 10.5 డిగ్రీలు

మెదక్ అర్బన్, జనవరి1 : ఉమ్మడి మెదక్ జిల్లా వణికిపోతున్నది. రెండు రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరిగినప్పటికీ పొంగమంచు కమ్మేస్తోంది. నిన్నటి వరకు మామూలుగా ఉంటుండగా.. చలి గాలులు ప్రభావంతో మళ్లీ చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. దాంతో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. సోమవారం సంగారెడ్డి జిల్లా అల్గోల్‌లో 10.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. న్యాల్కల్ 11.7, కోహీర్‌లో 12.1 డిగ్రీలుగా ఉంది. మెదక్ జిల్లాలోని దామరంచలో 12.9 డిగ్రీలు, డి.ధర్మారం 13.8, లింగాయిపల్లి 13.9 డిగ్రీలు, సిద్దిపేట జిల్లా హబ్సీపూర్ 13.6, వెంకటాపూర్ 13.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైంది.

ఆలయాలకు 'కొత్త' సందడి



జగదేవ్‌పూర్: కొండపోచమ్మ దర్శనానికి బారులు తీరిన భక్తులు

2024 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం జిల్లావ్యాప్తంగా ప్రధాన ఆలయాలకు భక్తులు పోటెత్తారు. కొత్త ఏడాదిలో తమకంతా మంచి జరగాలని వేడుకుంటూ ప్రజలు కుటుంబ సమేతంగా ఆలయాల్లో బారులు తీరి దేవతామూర్తుల దర్శనం చేసుకున్నారు. దీంతో ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలన్నీ కిటకిటలాడాయి. అదేవిధంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బంధుమిత్రులతో పరస్పర శుభాకాంక్షలు తెలుపుకుంటూ కొత్తసంవత్సర సంబురాలు జరుపుకున్నారు.



స్వర్ణకిరీటధారిణిగా వర్గల్ విద్యాధరి అమ్మవారు



వర్గల్: నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు



బెజ్జంకిలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వర్గల్, జనవరి 1: మండలంలోని ప్రముఖ ఆలయాలకు భక్తుల తాకిడి పెరిగింది. దైవ దర్శనం కోసం బారులు తీరి గంటల తరబడి వేచియున్నారు. జిల్లాలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలైన వర్గల్ మండలం విద్యాధరి క్షేత్రం, నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం సోమవారం భక్తులతో కిక్కిరిసాయి. వర్గల్ విద్యాధరి క్షేత్రంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఉదయం విద్యా సరస్వతీ అమ్మవారికి విశేష పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఆలయ మండపంలో చిన్నారులకు అక్షర స్వీకారాలు జరిగాయి. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ భోజన వసతిని ఏర్పాటు చేశారు. సోమవారం ఒక్కరోజే విద్యాధరి క్షేత్రాన్ని సుమారు 50 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యాధరి క్షేత్రం జాతరను తలపించింది. రాష్ట్ర ప్రభుత్వం భక్తుల సౌకర్యార్థం విద్యాధరి క్షేత్రం వరకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. గజ్వేల్ రూరల్ సీఐ జయరాంరెడ్డి, ఎస్ఐ విజయభాస్కర్ పర్యవేక్షణలో గట్టి భద్రత చర్యలు చేపట్టారు. అదేవిధంగా నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రాన్ని భక్తులు అధికంగా దర్శించుకున్నారు. ఆలయ పుష్కరిణిలో పుణ్య స్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ పర్యవేక్షణలో క్షేత్రానికి వచ్చిన భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. క్షేత్రాన్ని సుమారు 30 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు వారు తెలిపారు.

● **జగదేవ్‌పూర్:** మండలంలోని తిగుల్ నర్సాపూర్ గ్రామంలో గల శ్రీ కొండపోచమ్మ ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఆలయ సిబ్బంది తగిన చర్యలు తీసుకున్నారు. బిగ్‌బాస్ 7 విజేత పల్లవి ప్రశాంత్ కొండపోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● **దుబ్బాక/మిరుదొడ్డి:** దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. దుబ్బాకలోని శ్రీబాలాజీ, మండలంలోని రామేశ్వరంపల్లి కూడవెల్లి రామలింగేశ్వరాలయంలో, దుబ్బరాజరాజేశ్వర ఆలయంలో, అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామంలోని శ్రీవేంకటేశ్వరాలయంలో పూజలు నిర్వహించగా, చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

● **బెజ్జంకి:** నూతన సంవత్సరానికి స్వాగతం చెబుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం, సాయిబాబా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● **చిన్నకోడూరు:** మండలంలోని అనంతసాగర్ సరస్వతీ క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ పరిసరాల్లో ఏర్పడిన దుకాణాలతో సందడి వాతావరణం నెలకొంది. చంద్లాపూర్ శివారులోని రంగనాయకసాగర్ ప్రాజెక్టును వీక్షించడానికి ప్రజలు కుటుంబ సమేతంగా అధిక సంఖ్యలో తరలి వచ్చి ఆనందంగా గడిపారు. ప్రాజెక్టు పరిసరాల్లో కొందరు వంటలు చేసుకోగా, మరి కొందరు తమ వెంట తెచ్చుకున్న వంటకాలను ఆరగించారు. రంగనాయకసాగర్ వద్ద ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ ఉత్సాహంగా గడిపారు.

చేర్యాల, కొమురవెల్లి మండలాల్లో..

చేర్యాల, జనవరి 1: 2024 నూతన సంవత్సర వేడుకలను సోమవారం చేర్యాల, కొమురవెల్లి మండలాల ప్రజలు ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకున్నారు. స్థానిక అభయాంజనేయ, చెన్నకేశవ, వేణుగోపాలస్వామి, అయ్యప్పస్వామి, సాయియోగ లింగేశ్వర, మార్కండేయ దేవాలయాలతో పాటు ఆది శంకర మందిరంలో భక్తులు ప్రత్యేకపూజలు జరిపారు. చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో ఉల్లెంగల సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలలో మహిళలు ఆనందోత్సాహలతో పాల్గొన్నారు. షాలేము ప్రార్థనా మందిరంలో బ్రదర్ అందె విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు.



షాలేము ప్రార్థనా మందిరంలో కేక్ కట్‌చేస్తున్న బ్రదర్ అందె విజయ్‌కుమార్

డివైడర్ స్తంభాన్ని ఢీకొన్న బైక్.. కార్మికుడి మృతి



మృతిచెందిన హరిప్రసాద్

ములుగు, జనవరి 1: బైక్ అదుపు తప్పి డివైడర్ స్తంభాన్ని ఢీకొట్టడంతో ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని వంటిమామిడి వద్ద సోమవారం రాజీవ్‌రహదారిపై చోటు చేసుకున్నది. ములుగు పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. గజ్వేల్‌కు చెందిన పాసిగంటి హరిప్రసాద్(30) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా తుర్కపల్లి శివారులోని ఓ ప్రైవేటు కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం డ్యూటీకి వెళ్లి సోమవారం ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరుగుప్రయాణమయ్యాడు. వంటిమామిడి వద్ద రాజీవ్ రహదారిపై ప్రయాణిస్తుండగా బైక్ అదుపు తప్పి డివైడర్‌పై ఉన్న స్ట్రీట్ లైట్ స్తంభాన్ని వేగంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన హరిప్రసాద్ అక్కడిక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

పొలంలో ఒడ్డుపై నుంచి జారిపడి రైతు మృతి



మృతిచెందిన నర్సయ్య

మిరుదొడ్డి, జనవరి1: ప్రమాదవశాత్తు ఒడ్డుపై నుంచి జారిపడి రైతు మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రి అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామంలో చోటుచేసుకున్నది. అక్బర్‌పేట-భూంపల్లి ఎస్ఐ భువనేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు సిద్రమైన నర్సయ్య(55) ఆదివారం సాయంత్రం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. ఎంతకూ రాకపోవడంతో కుటుంబసభ్యులు ఫోన్ చేసినా స్విచ్ఛాఫ్ వచ్చింది. కొద్దిసేపటి తర్వాత శ్రీశైలం అనేరైతు కుటుంబసభ్యులకు ఫోన్ చేసి నర్సయ్య ఒడ్డుపైనుంచి జారిపడ్డాడని సమాచారం ఇచ్చాడు. ఈ సమాచారమందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తును చేపట్టారు. మృతదేహాన్ని దుబ్బాక ఆసుపత్రికి తరలించారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం.. రూ.3లక్షల ఆస్తినష్టం

గజ్వేల్, జనవరి 1: షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైన సంఘటన మండలం బూర్గుపల్లిలో సోమవారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన పంజా శ్రీకాంత్ గ్రామంలో ఇంటిని నిర్మిస్తుండగా, పక్కన ఉన్న స్థలంలో గుడిసె వేసుకుని తాత్కాలికంగా నివాసముంటున్నారు. ఈ క్రమంలో శ్రీకాంత్ కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి బయలుదేరుతున్న క్రమంలో గుడిసెలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. నీటితో ఆర్పేందుకు యత్నిస్తుండగా, చుట్టు పక్కల వారు అక్కడికి చేరుకుని మంటలను ఆర్పేశారు. కాగా ఇటీవల ధాన్యం విక్రయించిన రూ.60వేలు కాలిపోగా, దాదాపు రూ.3లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు శ్రీకాంత్ తెలిపారు. శ్రీకాంత్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు

దుబ్బాక, జనవరి 1: కూతురు తండ్రికి తలకొరివి పెట్టిన ఉదంతం అందరినీ కంటతడి పెట్టించింది. దుబ్బాక పట్టణానికి చెందిన కట్యారి పండరిచారి(48) అనే స్వర్ణకారుడు అనారోగ్యంతో మృతిచెందాడు. పండరికి ముగ్గురు కూతుళ్లు ఉండడంతో చిన్నకూతురే తలకొరివి పెట్టింది. ఈ దృశ్యం స్థానికులను కదిలించింది. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

కాంట్రాక్టర్‌కు లాభం చేకూర్చే వారిపై చర్యలు తీసుకోవాలి

మద్దూరు, జనవరి 1: దూళిమిట్ట మండలంలోని లింగాపూర్‌కు ఉపాధి హామీ పథకంలో మంజూరైన రూ.25 లక్షల సీసీ రోడ్ల నిర్మాణాలను స్థానికులు చేపట్టకుండా సివిల్ కాంట్రాక్టర్‌కు అప్పగించడంతో స్థానికంగా ఉన్న వాగులోంచి సుమారు రూ.4 లక్షల విలువ చేసే 150 ట్రిప్పుల ఇసుకను తరలించారు. దీంతో సహజవనరులను కొల్లగొడుతున్న వారితో పాటు సహకరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై స్థానికులు గద్దల మహేందర్‌తో పాటు పలువురు మాట్లాడారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం పనులు చేపట్టకుండా కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించారన్నారు. గ్రామపంచాయతీ కాంట్రాక్టర్‌కు లాభం చేకూర్చే విధంగా ఇసుకను తరలించడం ఏమిటని ప్రశ్నించారు. గోదావరి ఇసుకను వాడాల్సి ఉండగా గ్రామంలోని వాగు ఇసుకను వాడుకుంటున్నాడని ఆరోపించారు. ఈ విషయమై పంచాయత్‌రాజ్ ఏఈ కూడా స్పందించడం లేదన్నారు. వారిపై జిల్లా అధికారులు, కలెక్టర్ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పలు మండలాల్లో నర్సారెడ్డి జన్మదిన వేడుకలు



వర్గల్‌లో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గజ్వేల్/వర్గల్/కొండపాక, జనవరి 1: గజ్వేల్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తాలో తూంకుంట నర్సారెడ్డి జన్మదినం సందర్భంగా టీపీసీసీ నాయకులు నాయిని యాదగిరి, మద్దూరి మల్లారెడ్డి, గోపాల్‌రావు, సర్దార్‌ఖాన్‌ల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, సంబురాలు చేసుకున్నారు. అదేవిధంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆశాజ్యోతి కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడుజంగం రమేశ్‌గౌడ్ దుప్పట్లను పంపిణీ చేశారు. ఆశాజ్యోతి కేంద్రంలో కేక్ కట్ చేసిన అనంతరం అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప స్వాములకు భిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్గల్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నిమ్మ రంగారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు సందిప్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ తోట ముత్యాలు, మాజీ ఎంపీపీ మోహన్, మాజీ జడ్పీటీసీ ప్రభుగౌడ్ తదితరులు ఉన్నారు. కొండపాక రుద్రేశ్వరాలయంలో కాంగ్రెస్ నాయకులు పంబాల సురేందర్, రాంచంద్రం అంబటి రాజు తదితరులు డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి, కేక్ కట్ చేశారు. సిరిసినగండ్ల గ్రామంలో అభయజ్యోతి మనోవికాస కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు అన్నదానం నిర్వహించారు.

ఘనంగా చెరుకు ముత్యంరెడ్డి జయంతి



తొగుట: తుక్కాపూర్‌లో ముత్యంరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆయన సతీమణి విజయలక్ష్మి

తొగుట/దుబ్బాక/మిరుదొడ్డి, జనవరి 1: తొగుట మండలంలోని తుక్కాపూర్ గ్రామంలో సోమవారం మాజీ మంత్రి స్వర్గీయ చెరుకు ముత్యంరెడ్డి జయంతి వేడుకలను ఆయన సతీమణి చెరుకు విజయలక్ష్మి ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తొగుట ఎంపీపీ లతా నరేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అక్కం స్వామి, నాయకులు తిరుపతి, కొండల్‌రెడ్డి, దామోదర్, నర్సింహులు, మహిపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా దుబ్బాక, మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రాల్లో స్వర్గీయ చెరుకు ముత్యంరెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్‌పార్టీ నాయకులు పూలమాలను వేసి ఘన నివాళులర్పించారు.

బీమా కోరేగావ్ అమరుల త్యాగం మరువలేనిది

హుస్నాబాద్, జనవరి 1: పీష్వాల అరాచకాలను భరించలేక యుద్ధం చేసిన మహర్ వీరుల పోరాట పటిమ ఎంతో గొప్పదని దళిత, బహుజన, ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నా రు. సోమవారం మహారాష్ట్రలోని పూణే ప్రాంతం బీమా కోరేగావ్‌లో పీష్వాల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా 1818 జనవరి 1వ తేదీన మహర్లు చేసిన చారిత్రాత్మక పోరాటదినాన్ని పురస్కరించుకొని హుస్నాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ పోరాటంలో ఎంతో మంది అమరులయ్యారన్నారు. కార్యక్రమంలో దళిత ప్రజా సంఘాల నాయకులు కేడం లింగమూర్తి, గాదెపాక రవీందర్, ముక్కెర సంపత్ కుమార్, మేకల వీరన్నయాదవ్, కొయ్యడ కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ నుంచి శబరిమలకు సైకిల్ యాత్ర



శబరి ఆలయానికి సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న దృశ్యం

గజ్వేల్ రూరల్, జనవరి 1.. గజ్వేల్ పట్టణంలోని శ్రీహరిహర అయ్యప్ప ఆలయం నిర్వాహకుడు, ప్రధాన అర్చకుడు నందబాలశర్మ ఆధ్వర్యంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం కొలువు దీరిన మూల విగ్రహానికి పండ్లరసాలతో పంచామృతాభిషేకం చేసి, పట్టు వస్త్రాలతో అందంగా అలంకరించి ప్రత్యేక మంగళహారతి ఇచ్చారు. అనంతరం గజ్వేల్‌కు చెందిన మాలధారణ స్వాములు ఎర్రవాడ యాదగిరి, సంగునూరు నవీన్‌లు శబరిమల వరకు చేస్తున్న సైకిల్ యాత్రను ఆలయ అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్ స్వామి ప్రారంభించారు. తీర్థ ప్రసాద వితరణ అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, కోఆప్షన్ గగ్గిశెట్టి రాజు, గురుస్వాములు సురేష్,దుర్గం, తదితరులు పాల్గొన్నారు.

సేవాభావంతో ముందుకు సాగాలి



స్ఫటికలింగేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న శ్రీరంగం పీఠాధిపతి

తొగుట, జనవరి 1: ప్రతిఒక్కరూ సత్ప్రవర్తన, సేవాభావంతో ముందుకు సాగాలని శ్రీరంగం పీఠాధిపతి శ్రీమాధవానంద సరస్వతీ స్వామి సూచించారు. సోమవారం తొగుట- రాంపూర్ కోటిలింగాల ఆలయంలో స్ఫటికలింగేశ్వర స్వామికి 1,100 లీటర్ల ఆవుపాలు, బాదాంలతో అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయాలని భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని పూజలలో పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.

అనారోగ్యంతో మాజీ ఎంపీపీ మృతి



ఎల్లారెడ్డి(ఫైల్)

బెజ్జంకి, జనవరి 1: బెజ్జంకి మండల మాజీ ఎంపీపీ గుండ ఎల్లారెడ్డి సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన గుండా ఎల్లారెడ్డి బెజ్జంకి మండలం తొలి ఎంపీపీగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన మృతి పట్ల నాయకులు, గ్రామస్థులు సంతాపం వ్యక్తం చేశారు.

సత్యసాయి భజన మండలి 21వ వార్షికోత్సవం

కొండపాక, జనవరి 1: కుకునూరుపల్లిలోని భగవాన్ సత్యసాయి భజన మండలి 21వ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పేద మహిళలకు చీరలు, పిల్లలకు దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం మందిరంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, సాయంకాలం భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కుకునూరుపల్లి మండల సత్యసాయి సమితి కన్వీనర్ నందకిషోర్ శర్మ, ఉప్పల రాజు, బాలస్వామి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు

పలు మండలాల్లో న్యూఇయర్ సంబురాలు



హుస్నాబాద్‌లో కేక్‌ను కట్ చేస్తున్న చైర్‌పర్సన్ ఆకుల రజిత



బెజ్జంకిలో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హుస్నాబాద్, జనవరి 1: హుస్నాబాద్ పట్టణంలో సోమవారం 2024 న్యూఇయర్ వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్‌లను కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పట్టణంలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్ఫూర్తి అసోసియేషన్ ఆధ్వర్యంలో గెట్ టు గెదర్ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత హాజరై నూతన సంవత్సర కేక్‌ను కట్ చేశారు. కొత్త ఏడాదిలో హుస్నాబాద్ పట్టణం అభివృద్ధిలో పరుగులు పెట్టాలని ఆకాంక్షించారు. పలువురు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రాజకీయ నాయకులు పాల్గొని మంత్రి పొన్నం ప్రభాకర్ నియోకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా అభివృద్ధిలో భాగస్వాములమవుదామన్నారు. కార్యక్రమంలో స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు పందిల్ల శంకర్, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, జనగామ రత్న, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

● **బెజ్జంకి:** బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ కూడలిలో నూతన సంవత్సర కేక్ కట్ చేసి మండల ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్‌ను బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

● **కొండపాక:** మండలంలో ప్రజలు నూతన సంవత్సర వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. అర్ధరాత్రి నుంచి యువకులు టపాకాయలు కాల్చి కేరింతలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. కొండపాక రాఘవేంద్ర పబ్లిక్ స్కూల్ విద్యార్థులు 2024 అనే సంఖ్య ఆకారంలో కూర్చుని కొత్త ఏడాదికి స్వాగతం పలికారు.

అయోధ్య అక్షింతలతో ఘనంగా శోభాయాత్ర



కోహెడ నుంచి గ్రామాలకు అక్షింతలను తరలిస్తున్న బాధ్యులు

కోహెడ, జనవరి 1: అయోధ్య నుంచి వచ్చి శ్రీరాముడి అక్షింతల శోభాయాత్రను కోహెడ మండల కేంద్రంలో సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ శోభాయాత్ర కోహెడలోని మల్లన్న ఆలయం నుంచి ప్రారంభమై ప్రధాన రహదారుల వీధుల గుండా రామాలయానికి చేరుకుంది. ఈ యాత్రలో మహిళలు భారీగా పాల్గొన్నారు. భక్తుల శ్రీరామ నామస్మరణతో వీధులు మార్మోగాయి. మండలంలోని 27 గ్రామాల్లో అక్షింతలను డప్పుచప్పుళ్ల మధ్య రామనామస్మరణతో ఇంటింటికీ పంపిణీ చేశారు. ఆర్ఎస్ఎస్ ఖండా వర్గ్ సిద్దిపేట కరీంనగర్ బాధ్యులు జి సత్యనారాయణ, బాలరాజు, రాజుజీ రాములోరి అక్షింతలను వితరణ చేశారు. నాడు అయోధ్య కరసేవకు వెళ్లిన పేర్యాల రాజేశ్వరరావు, వనపర్తి మల్లేశంతోపాటు శ్రీరాములపల్లి భజనమండలి సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, పేర్యాల రాజేశ్వరరావు, వనపర్తి మల్లేశం, సర్పంచ్ మ్యాకాల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పొన్నాల లక్ష్మణ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **కొండపాక:** అయోధ్యలోని శ్రీరామ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా అక్షింతల కలశాలను ప్రతీ ఇంటికి అందజేస్తున్నట్లు అయోధ్య రామతీర్థ ట్రస్ట్ కుకునూరుపల్లి మండల అధ్యక్షుడు కిషోర్‌శర్మ తెలిపారు సోమవారం కుకునూరుపల్లిలో ఇంటింటికి అయోధ్య అక్షింతలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల పాండురంగం, విశ్వహిందూ పరిషత్ వాసవీ క్లబ్ కొండపాక అధ్యక్షుడు ఉప్పల రాజు, హిందూ ధార్మిక సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో పదునెట్టాంబడి

హుస్నాబాద్, జనవరి 1: హుస్నాబాద్ పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో సోమవారం దివ్య పదునెట్టాంబడి పూజ కార్యక్రమాన్ని అయ్యప్ప స్వాములు ఘనంగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు అయ్యప్ప స్వామికి 108 లీటర్ల ఆవు పాలతో విశేష అభిషేకాలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల వెంకట్, కౌన్సిలర్లు వాల సుప్రజ, అయిలేని శంకర్‌రెడ్డి, వల్లపు రాజు, ఎండి అయూబ్, వివి రమణ, బుచ్చిరెడ్డి, నరేందర్, సంపత్, రాజన్న, నరసింహచారి తదితరులున్నారు.



అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహానికి అభిషేకం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత దంపతులు

డోలాయమానంలో చేర్యాల మున్సిపల్ 'అవిశ్వాసం'

● **భిన్న పరిస్థితులతో ఇరువర్గాల్లో అయోమయం**

చేర్యాల, జనవరి 1: చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డిలపై సొంత పార్టీ కౌన్సిలర్లు కాంగ్రెస్‌తో చేయికలిపి అవిశ్వాస తీర్మానం పెట్టిన నేపథ్యంలో బీఆర్ఎస్ అధిష్టానం బుజ్జగింపుల పర్వాన్ని ప్రారంభించింది. సొంతపార్టీలోని అసంతృప్త కౌన్సిలర్లకు నచ్చజెప్పేందుకు ఓ స్పెషల్ టీం ఆదివారం రంగంలోకి దిగి పలువురి ఇళ్లలోకి వెళ్లి అవిశ్వాసయత్నం విరమించుకోవాలని కోరింది. అలాగే ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కూడా ఫోన్‌లో మాట్లాడుతూ పార్టీలైన్ దాటకూడదని, తప్పక భవిష్యత్తు ఉంటుందని సూచిస్తున్నారు. ఏడుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లలో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, 6వ వార్డు కౌన్సిలర్ యాట కనకమ్మ మినహా మిగతా నలుగురు కౌన్సిలర్లు అవిశ్వాసానికి అనుకూలంగా ఉన్న విషయం విదితమే. కాగా తాజా బుజ్జగింపులతో ఓ కౌన్సిలర్ మెత్తబడినప్పటికీ మిగతా ముగ్గురిలో ఇరువురు గట్టిగా పట్టుబట్టడం గమనార్హం. కాంగ్రెస్‌కు ఐదుగురు కౌన్సిలర్లు ఉండగా, మ్యాజిక్ ఫిగర్‌కు బీఆర్ఎస్‌లో ఇద్దరి అవసరం పడింది. కానీ పంతంపైఉన్న ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లలో ఒకరు చైర్మన్, మరొకరు వైస్ చైర్మన్ ఆశిస్తుండటం, మెజారిటీ ఉన్న కాంగ్రెస్ కౌన్సిలర్లు అందుకు విబేధిస్తుండటంతో అవిశ్వాసంపై సందిగ్ధత నెలకొన్నది. బీఆర్ఎస్ అసంతృప్త కౌన్సిలర్ల పంతం నెగ్గాలంటే కాంగ్రెస్ సహకారం లేనిదే నెరవేరని పరిస్థితి ఉండటంతో ఒక్కసారిగా డోలాయమానంలో పడిపోయారు. అటు బీఆర్ఎస్ కౌన్సిలర్లు సహాయం చేస్తేనే చైర్మన్ పీఠం దక్కేఅవకాశం ఉండటంతో ఇటు కాంగ్రెస్ కౌన్సిలర్లు అయోమయంలో పడిపోయారు. ఒకవేళ అవిశ్వాసం విరమించుకుందామంటే అపవాదు మూటగట్టుకోవాల్సివస్తుందని తలలు పట్టుకుంటున్నారు. అవిశ్వాస విషయమై కాంగ్రెస్ ఐదుగురు కౌన్సిలర్లు ఆదివారం మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డితో హైదరాబాదులో భేటీ అయ్యారు. అవిశ్వాసం నెగ్గేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కానీ బీఆర్ఎస్ కౌన్సిలర్లలో నెలకొన్న అయోమయం కాంగ్రెస్‌ను డైలామాలో పడేసింది. ఇరుపార్టీల లోనూ నెలకొన్న భిన్నపరిస్థితుల కారణంగా ఇరువురిని పార్టీ మారాలని, చైర్మన్, వైస్ చైర్మన్‌లకు మద్దతునిస్తే భవిష్యత్తులో మున్సిపల్‌తో పాటు మార్కెట్ కమిటీలో అవకాశం కల్పిస్తామన్న ప్రతిపాదన తీసుకువస్తున్నారు. ఈ విషయమై ఆలోచించుకుంటామని బీఆర్ఎస్ కౌన్సిలర్లు సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తీసుకునే చర్యలపై అందరి దృష్టి మళ్లింది.



గవర్నర్ తమిళిసైకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న బాలల సంక్షేమ సమితి జిల్లా కమిటీ సభ్యుడు

గవర్నర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు

గజ్వేల్, జనవరి 1: తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళసై సౌందరరాజన్‌ను బాలల సంక్షేమ సమితి జిల్లా కమిటీ సభ్యుడు దేశబోయిన నర్సింహులు మర్యాదపూర్వకంగా కలిసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం రాజ్‌భవన్‌లో కలిసిన ఆయన పుష్పగుచ్చం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

రేవంత్‌రెడ్డిని కలిసిన శ్రీకాంత్‌రావు



సీఎంకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీపీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత్‌రావు

గజ్వేల్, జనవరి 1: సీఎం రేవంత్‌రెడ్డిని టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన సీఎంకు పుష్పగుచ్చం అందజేసి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని సీఎం సూచించినట్లు శ్రీకాంత్‌రావు తెలిపారు.

కేటీఆర్‌ను కలిసిన ములుగు ఎంపీపీ



కేటీఆర్‌కు బొకేను అందజేస్తూ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీపీ

ములుగు, జనవరి 1: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్లా ఎమ్మెల్యే కేటీఆర్‌ను ములుగు ఎంపీపీ లావణ్య అంజన్‌గౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రతీ బీఆర్ఎస్ కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని వివరించారు. ఎవరూ అధైర్యపడొద్దని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను అధికంగా గెలిపించుకోవడం కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కేటీఆర్ సూచించారు.

టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన దేవీ రవీందర్



విరాహత్‌అలీకి శుభాకాంక్షలు తెలుపుతున్న దేవీ రవీందర్

గజ్వేల్, జనవరి 1: తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఖాజా విరాహత్‌అలీని ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువా, పుష్పగుచ్ఛాన్ని అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో ఎంపీటీసీల ఫోరం జిల్లా కన్వీనర్ అరిగే అశోక్, యెళ్ల మోహన్‌రెడ్డి ఉన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మానకొండూరు ఎమ్మెల్యే



ఎమ్మెల్యే కవ్వంపల్లికి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బెజ్జంకి, జనవరి 1: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సోమవారం హైదరాబాదులో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రూపొందించిన 2024నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించి నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.